సాక్షి
జగిత్యాల
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



పూల పండుగ

ఉమ్మడి జిల్లాలో నేటినుంచి బతుకమ్మ సందడి

పుట్టింటికి వచ్చిన ఆడపడుచులా.. రెక్కలు విచ్చిన సీతాకోక చిలుకలా.. కరుణించి కాపాడే అమ్మవారిలా.. తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ రానేవచ్చింది.. ఊరూవాడా ఆటపాటల సందడి తెచ్చింది.. బుధవారం నుంచి ప్రారంభమయ్యే వేడుకలు సద్దుల సంబురంతో ముగియనున్నాయి. నేటి(తొలిరోజు) వేడుకను ఎంగిలిపూలు అంటారు. అంటే.. ముందు రోజు మొగ్గలుగా ఉన్న పూలను తెచ్చి, మరుసటి రోజు బతుకమ్మ పేర్చేటప్పుడు వాటిని ఊది పేరుస్తారు. పితృ అమావాస్య రోజు ఉదయం లేచి, చనిపోయిన పెద్దలకు నైవేద్యాలు చేస్తారు. ఆ తర్వాత భోజనం చేసి, బతుకమ్మను పేర్చడం వల్ల కూడా ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. ఇలా రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాకు పండుగ వాతావరణం వచ్చింది.

న్యూస్‌రీల్

రైతుల హక్కుల సాధనకు భారీగా తరలిరండి



మల్యాలలో రైతులతో సమావేశమైన రైతుసంఘాల నాయకులు

మల్యాల: రైతులు తమ హక్కుల సాధనకు ఈనెల 4న జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు ధర్నాకు వేలాదిగా తరలిరావాలని జిల్లా రైతు ఐక్య వేదిక కన్వీనర్ నేరెళ్ల భూమారెడ్డి కోరారు. మంగళవారం మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, మానాల గ్రామాల రైతు సంఘాలతో సమావేశయ్యారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, దొడ్డువడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ సాధనకు రైతులు మహాధర్నాకు తరలిరావాలని కోరారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, అయిల్నేని సాగర్‌రావు, దొంగ ఆనందరెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, మహిపాల్ రెడ్డి, రాజన్న, మల్లయ్య, చిన్న దుర్గయ్య, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

కొండగట్టుకు భక్తుల తాకిడి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కోనేరులో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బీర్‌పూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, గల్ఫ్ కార్మికులు

సారంగాపూర్: గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐ పాలసీ తెచ్చినందుకు బీర్‌పూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గల్ఫ్ కార్మికుల కుటుంబాలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కన్నవారిని, భార్యాపిల్లలను వదిలి గల్ఫ్ బాట పడుతూ.. ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ముందుకురావడం ఆనందంగా ఉందన్నారు. రూ.5 లక్షల ఆర్థిక సహాయంతోపాటు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కొల్వాయి విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెర్పూరి సుభాష్, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

సద్దుమణగని బస్‌షెల్టర్ వివాదం

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటుపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య నెలకొన్న వివాదం ఇంకా సద్దుమణగలేదు. ఖాదీ ప్రతిష్ఠాన్‌కు చెందిన స్థలంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం బస్‌షెల్టర్ ఏర్పాటుకు యత్నించడం.. బీఆర్‌ఎస్ నాయకులు అక్కడకు వెళ్లి అడ్డుకోవడం తెలిసిందే. ఈ వ్యవహారం ఇరుపార్టీల మధ్య వివాదానికి దారి తీయడంతో అదేరోజు రాత్రి నుంచి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. షెల్టర్‌నిర్మాణంలో భాగంగా వేసిన షెడ్డును తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకులు పట్టుబట్టుతుండగా.. ప్రజల సౌలభ్యం కోసమే ఏర్పాటు చేస్తున్నామని, తొలగించవద్దని కాంగ్రెస్ నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో షెల్టర్ విషయంలో ఏం నిర్ణయం తీసుకోవాలన్న దానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

రైతులకు దసరా లక్కీ కూపన్లు




లక్కీకూపన్

జగిత్యాలజోన్: దసరా సందర్భంగా జిల్లాలోని మేడిపల్లి, భీమారం మండలాల్లో యువకులు కొత్త రకం లక్కీ కూపన్లను ప్రచారం చేస్తున్నారు. కూపన్‌కు కేవలం రూ.100 మాత్రమేనని, బహుమతులు చాలా ఉన్నాయని బ్రోచర్లు వేస్తున్నారు. మేడిపల్లి మండలం తొంబరావుపేట యువకులు రైతులకు ఉపయోగపడేలా మొదటి బహుమతిగా ట్రాక్టర్ కోడి ఎరువు, రెండో బహుమతిగా బ్యాటరీ స్ప్రేపంపు, మూడో బహుమతిగా మొక్కజొన్న విత్తనాల ప్యాకెట్, నాలుగో బహుమతిగా డీఏపీ బస్తా, ఐదో, ఆరో బహుమతి మొక్కజొన్న విత్తనాలు, ఏడో బహుమతిగా వరి విత్తనాల బ్యాగ్ ఇస్తామని బ్రోచర్ విడుదల చేశారు. దసరా రోజు డ్రా ఉంటుందని ప్రకటించారు.

బాపూజీ బాటలో..

- దేశ స్వాతంత్య్రం కోసం అహింసామార్గంలో ఎన్నో ఉద్యమాలు
- మహాత్ముని బాటలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు
- నేడు గాంధీ జయంతి



దేశానికి స్వాతంత్ర్య తెచ్చిపెట్టిన మహాత్ముడు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా నడుస్తున్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు. బాపూజీ కలలుగన్న స్వచ్ఛభారతం వైపు సాగుతున్నారు. పలు గ్రామాల్లో సంపూర్ణంగా మద్య, మాంసాన్ని నిషేధించారు. గీత దాటితే జరిమానా విధిస్తున్నారు. 'స్వదేశీ వస్తువులే వాడుదాం.. మనమే తయారు చేద్దాం' అనే నినాదం నుంచి పుట్టుకొచ్చిందే మెట్‌పల్లి, వావిలాల ఖాదీ. పాలిస్టర్ బట్ట పరుగు పెడుతున్నా... గాంధీ కలలకు ప్రతిరూపంగా భావించి ఖాదీ గొప్పతనాన్ని చాటుతున్నారు. కొందరు గాంధీజీ చిత్రాలను సేకరించి, మదిలో పదిలంగా దాచుకుంటున్నారు. నేడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్పెషల్ స్టోరీ.

కరీంనగర్‌లో గాంధీ మ్యూజియం



గాంధీ సెంటనరీ మ్యూజియం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గాంధీ సెంటనరీ మ్యూజియం 1964లో ఏర్పాటైంది. 1969లో ప్రస్తుత బస్టాండ్ ఎదురుగా 20 గంటల విస్తీర్ణంలో జెడ్పీ నిధులు, దాతల సహకారం, అప్పటి విద్యాశాఖ మంత్రి పీవీ.నరసింహారావు, కలెక్టర్ మాల కొండయ్యల చొరవతో దీన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో లభించిన చారిత్రక ఆధారాలు, శిలాశాసనాలు, తామ్ర పత్రాలు, నాణేలు, ఫిరంగులు, పాతరాతి యుగపు పనిముట్లు, పాత్రలు, విల్లులు, బాణాలు, శాతవాహనులు, రాష్ట్రకూటులు, విష్ణుకుండినులు, చాళుక్యరాజులు, కాకతీయ, విజయనగర రాజులు, మొగలులు, కుతుబ్‌షాహీల కాలానికి చెందిన నాణేలు, ఇటుకలు, రాతికుండలు, విగ్రహాలు, యుద్ధ సామగ్రి, నిజాం కాలం నాటి రాగి, వెండి నాణేలు తదితరాలను ఇక్కడ చూడవచ్చు. ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మ్యూజియాన్ని ఉచితంగా సందర్శించవచ్చు.

గూడూరు.. మద్యపాన నిషేధం

ముస్తాబాద్(సిరిసిల్ల): గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఆ ఊరి సొంతం. 18 ఏళ్లుగా మద్యపాన నిషేధం అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గూడూరు. 2006కుముందు ఈ గ్రామంలోని మగవారు తరచూ మద్యం సేవిస్తూ గొడవలు పెట్టుకోవడం, పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదవడం జరిగేవి. పొద్దంతా కష్టపడితే వచ్చే డబ్బులు మద్యానికే ఖర్చయ్యేవి. దీంతో అప్పటి సర్పంచ్ చీటి వెంకటనర్సింగరావు సమక్షంలో గ్రామస్తులందరూ మద్యపాన నిషేధ నిర్ణయం తీసుకొని, ఇప్పటికీ కట్టుబడి ఉన్నారు. మద్యం విక్రయిస్తే రూ.10 వేల జరిమానా విధించాలని తీర్మానించారు. సర్పంచ్, ఉపసర్పంచ్, మహిళా సంఘాల వారు పర్యవేక్షిస్తున్నారు. కిరాణా దుకాణాల్లో సిగరేట్, గుట్కా విక్రయాలనూ నిషేధించారు.



గూడూరు గ్రామం

బాపూజీ చిత్రాల సేకరణలో సిరిసిల్ల యువకుడు



సేకరించిన బాపూజీ స్టాంపులు



సాయిరాం

సిరిసిల్లటౌన్: బాపూజీ చిత్రాలు, పేపర్ కటింగ్స్ సేకరించి, భద్రపరుస్తున్నాడు సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన కొత్వాల్ సాయిరాం. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద హెయిర్ పార్లర్ నిర్వహిస్తూ దశాబ్దాలుగా గాంధీజీకి సంబంధించిన ప్రతీ చిత్రాన్ని సేకరిస్తున్నాడు. గాంధీ బాల్యం నుంచి ఆయన చనిపోయే వరకు.. 3 వేలకు పైగా ఫొటోలు, స్టాంపులను సేకరించాడు. ఆర్‌బీఐ నుంచి బాపూజీ బొమ్మలతో వెలువడిన నాణేలు, పత్రికల్లో వచ్చిన ఆయన వ్యాసాల క్లిప్పింగ్స్, కుటుంబసభ్యులతో ఉన్న ఫొటోలు కూడా ఇతని వద్ద ఉన్నాయి. పత్రికల్లో వచ్చే గాంధీజీ వ్యాసాలు, ఆయన చిత్రాల క్లిప్పింగులను పదిల పరుస్తున్నాడు. ఇప్పుడు తనకు 41 ఏళ్లు అని, 12 వయసు నుంచి వీటిని సేకరిస్తున్నట్లు తెలిపాడు.

శుభ్రత పాటిస్తరు.. మద్యం ముట్టరు

- ఆదర్శం.. నారాయణపూర్, పదిర, హరిదాస్‌నగర్, దుమాలవాసులు



నారాయణపూర్‌లో రోడ్డుకిరువైపులా పచ్చని చెట్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/ఇల్లంతకుంట(మానకొండూరు): మద్యం ముట్టరు.. పరిశుభ్రత పాటిస్తున్నరు రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్, పదిర, హరిదాస్‌నగర్, దుమాల ప్రజలు. ఈ గ్రామాల్లో మద్యం అమ్మితే రూ.5 వేలు జరిమానా విధిస్తామని 20 ఏళ్ల క్రితం తీర్మానం చేశారు. రోడ్లకిరువైపులా పచ్చని చెట్లు ఉన్నాయి. తడి, పొడి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. వర్మి కంపోస్టు ద్వారా ఆదాయం పొందుతున్నారు. తాను సర్పంచ్‌గా హరిదాస్‌నగర్‌లో స్వచ్ఛతపై దృష్టిసారించానని, గ్రామానికి జాతీయ అవార్డు వచ్చిందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు తెలిపారు.

జంగారెడ్డిపల్లి: ఇల్లంతకుంట మండలంలోని జంగారెడ్డిపల్లె 2023లో జిల్లాస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు, వరుసగా నాలుగేళ్లు దీన్‌దయాళ్ అవార్డులు అందుకుంది. తడి, పొడి చెత్త వేయడానికి గ్రామ వీధుల్లో స్టీల్ డబ్బాలు ఏర్పాటు చేశారు. రోడ్లకిరువైపులా మొక్కలు నాటారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఓ దాత 700 బట్ట సంచులు అందజేశారు. గ్రామస్తులు ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. ప్రతీ వీధిలో సీసీ రోడ్లు కనిపిస్తాయి. సీసీ కెమెరాలు, మైక్ సెట్లు, ఓపెన్ జిమ్‌తో ఆకర్షణగా నిలుస్తోంది.

రాణా మెట్లెక్కని ఆకసాయిపల్లె



ఆకసాయిపల్లెలో పారిశుధ్య పనులు

ధర్మపురి: మండలంలోని ఆకసాయి పల్లె గిరిజన గ్రామం. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 600 జనాభా ఉండగా 260 మంది ఓటర్లున్నారు. ఇక్కడి ప్రజలు ఐకమత్యానికి మారుపేరుగా నిలుస్తున్నారు. ఎవరికి ఓటు వేయాలనేది కలిసే నిర్ణయిస్తారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా అందరూ కలిసి, సర్పంచ్ ఆధ్వర్యంలో పరిష్కరించుకుంటారు. గ్రామానికి చెందిన ఒక్కరు కూడా ఇప్పటివరకు ఠాణా మెట్లెక్కలేదు. గ్రామస్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. ఉదయం కూలీ పనులకు వెళ్తే.. సాయంత్రం తిరిగి వస్తారు. వచ్చాక ఒక్కచోట కూర్చొని, కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు.

వావిలాల నుంచే జాతీయ జెండా



కండెలు తయారు చేస్తున్న మహిళలు

జమ్మికుంట(హుజూరాబాద్): దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గాంధీజీ శిష్యుడు అన్నాసాహెబ్ సహస్ర బుద్ధి 1929లో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామంలో పర్యటించారు. ఇక్కడ మహారాష్ట్ర చరఖా సంఘ్‌ను ప్రారంభించారు. 1951లో హైదరాబాద్ ఖాదీ సమితిగా, 1967లో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ నుంచి విడిపోయి, వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్‌గా ఏర్పడింది. దీనికి ఈ గ్రామ దేశ్‌ముఖ్ ఎక్కటి అన్నారెడ్డి ఏడెకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఇక్కడ సుమారు 1,000 మంది వస్త్రాల తయారీతో ఉపాధి పొందుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1972లో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగురవేసిన జాతీయ జెండాలు వావిలాలలో తయారు చేసినవేనని ఖాదీ సంస్థ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రాతిష్ఠాన్ 2005లో ఉత్తమ నేత కార్మికులు, 2009లో ఉత్తమ ఖాదీ సంస్థగా రెండుసార్లు జాతీయ స్థాయిలో అవార్డులు దక్కించుకుంది.

మెట్‌పల్లి నుంచి నెహ్రూకు లాల్చీ



ఖాదీ ప్రతిష్ఠాన్ కార్యాలయం

మెట్‌పల్లి(కోరుట్ల): విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని బాపూజీ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన శిష్యుడు అన్నాసాహెబ్ సహస్ర బుద్ధి 1929లో మెట్‌పల్లికి వచ్చి, అఖిల భారత చరఖా సంఘం ఏర్పాటు చేశారు. ఇక్కడి ఖాదీ కార్మికులు ఓవైపు వస్త్రాలను తయారు చేస్తూనే.. మరోవైపు స్వాతంత్ర్య, నిజాంకు వ్యతిరేకంగా జరిపిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1951లో హైదరాబాద్ ఖాదీ సమితిగా, 1967లో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్‌గా మార్చబడింది. జోగ గంగారాం అనే కార్మికుడు కుట్టు లేకుండా లాల్చీని తయారు చేసి, అప్పటి ప్రధాని నెహ్రూకు, మగ్గంపై రూపొందించిన షేర్వానీని అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌కు అందించి, ఖాదీ ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటాడు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు వివరాలు సేకరించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: ఫ్యామిలీ డిజిటల్ కార్డు లబ్ధిదారుల వివరాలు సేకరించాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల మూడోతేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రతి నియోజకవర్గంలోని మున్సిపల్, గ్రామంలో కుటుంబవివరాలను ఇంటింటికీ తిరిగి సేకరించాలని, ఇందుకు నోడల్ అధికారులను నియమించాలని సూచించారు. సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలను ఎంట్రీ చేయాలన్నారు. ఈనెల 8తేదీ వరకు ప్రక్రియ పూర్తి చేయాలని, 9న స్క్రూటినీ చేయాలని, 10న రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పూర్తయ్యాయా అని తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, సన్నధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తుందని వెల్లడించారు. సన్నాలకు.. దొడ్డురకాలకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు రానీయొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

దుబాయ్‌లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జగిత్యాలటౌన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం) ఆధ్వర్యంలో దుబాయ్‌లో డెలివరీబాయ్స్ ఉద్యోగాలకు ఈనెల 5న జిల్లాకేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్తమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి విద్యార్హతతో 21 నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని, ఇండియన్ టూవీలర్ లైసెన్స్, పాస్‌పోర్ట్ ఉండాలని, ఆసక్తి, అర్హత కలిగి ఉన్న వారు ఈనెల 5న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల లోపు ధరూర్ క్యాంపు వద్దగల అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 94400 51285, 94400 48500 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భైరవస్వామికి ప్రత్యేక అలంకరణ



భైరవస్వామి వారు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయం వెనుకభాగంలో ఉన్న బేతాళ (భైరవ) స్వామిని అలంకరించారు. ఈవో రామకృష్ణారావు ఇటీవల స్వామివారి విగ్రహాన్ని పరిశీలించారు. భక్తులకు పూర్తి స్థాయిలో కనిపించేలా అర్చకులతో నిత్యం అలంకరిస్తున్నారు. భైరవ స్వామికి చందనోత్సవాన్ని చేయాల్సిన అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. వారి తీరుపై అంజన్న భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలకైనా గ్యారంటీ ఇవ్వండి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల: ఆరుగ్యారంటీలు ఎలాగూ అమలు చేయడం లేదని, కనీసం ప్రజల ప్రాణాలకైనా గ్యారంటీ ఇవ్వాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తే కాంగ్రెస్ గాలికొదిలేసిందన్నారు. జిల్లావ్యాప్తంగా విషజ్వరాలు ప్రబలుతున్నా కనీసం పట్టించుకోవడం లేదన్నారు. బ్లీచింగ్ పౌడర్‌కు బదులు సున్నం చల్లుతూ మమ అనిపిస్తున్నారని, ఓట్లు వేసి గెలిపించిన పాపానికి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. అల్లీపూర్‌లో విషజ్వరంతో చిన్నారి మరణం కలిచి వేసిందన్నారు. వానాకాలం సీజన్ ముగిసినా రైతులకు ఇంత వరకు రైతుభరోసా అందించలేదని గుర్తు చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, తుమ్మ గంగాధర్, మాజీ జెడ్పీటీసీ మహేశ్, వొల్లం మల్లేశ్, ఆనందరావు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు కొత్త గైడ్‌లైన్స్

జగిత్యాల: ఎస్సీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరులో నూతన గైడ్‌లైన్స్ పొందుపర్చిందని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం డెమో అథంటికేషన్, బయోమెట్రిక్ అథంటికేషన్, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఈపాస్ వెబ్‌సైట్‌లో ఫ్రెష్/రెన్యువల్ రిజిస్ట్రేషన్‌లో ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ డిటేల్స్ చూసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మూడు దశల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసిన దరఖాస్తులను సంబంధిత కళాశాలల్లో ప్రిన్సిపాల్‌కు ఇవ్వాలని తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



సాతారంలో ఇసుక రీచ్ కోసం పెద్దవాగును పరిశీలిస్తున్న అధికారులు

మల్లాపూర్: గోదావరి, పెద్దవాగు తీరప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఆర్‌ఐ తిరుపతిరావు హెచ్చరించారు. మండలంలోని వీవీరావుపేట, సాతారం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఇసుకరీచ్ కోసం పెద్దవాగును రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరితోపాటు పెద్దవాగు నుంచి ఇసుక రవాణా చేసేందుకు వీడీసీ సభ్యులు వేలంవేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పరిశీలనలో రెవెన్యూ ఆర్‌ఐ సురేష్, మైనింగ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రిటీష్ పాలకులను ఎదురించిన యోధుడు



విగ్రహావిష్కరణలో కాంగ్రెస్ నేత నీలం మధు

- 'కట్ట బ్రహ్మన' నేటి యువతకు ఆదర్శం
- కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్
- కథలాపూర్ విగ్రహావిష్కరణ

పటాన్‌చెరుటౌన్: బ్రిటీష్ పాలకుల అరాచకాలను ఎదురించి వారి నియంతృత్వంపై కత్తి దూసిన మహా యోధుడు వీరపాండ్య కట్ట బ్రహ్మన అని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ కొనియాడారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తుర్తి గ్రామంలో ముదిరాజ్ యువసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కట్ట బ్రహ్మన విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అరాచకాలు, పన్ను వసూళ్లను ఎదురించి పోరాడిన వీరుడని అన్నారు. మొదటి ఇంగ్లిష్ సైన్యాధిపతి అలాన్ దొర పెద్ద సైన్యంతో కోటపై యుద్ధానికి వస్తే వారిని తరిమికొట్టి ఓడించిన ఘనత వీర పాండ్యన్ సొంతమన్నారు. అలాంటి మహనీయుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ యూత్ నాయకులు పిట్టల వంశీ, నేమురి నరేశ్, కథలాపూర్ ముదిరాజ్ మండల అధ్యక్షుడు నర్సయ్యపల్లి మధు, మాజీ సర్పంచ్ కొలకాని శేఖర్, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఎలుకబావివాడ ప్రాంతంలో నివాసముంటున్న రాపల్లి సౌమ్య (25) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారానికి చెందిన సౌమ్యను ఎలుకబావివాడకు చెందిన రాకేశ్‌కిచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. ఏమైందో తెలియదుగానీ.. మధ్యాహ్నం తన బెడ్‌రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో పట్టణ ఎస్సై కిరణ్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. యువతి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న వాణి

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ అధికారి వాణి సోమవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస, చల్‌గల్, లక్ష్మీపూర్, సోమన్‌పల్లి, కల్లెడ గ్రామాల్లో పర్యటించారు. రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. ఫర్టిలైజర్ షాపులను పరిశీలించారు. రైతులకు అవగాహన కల్పించాలని కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో రూరల్ మండల ఏఈవోలు హరీశ్, రమ్య, వరుణ్, రవళి, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ప్రతిభ



కుందారపు విజయ్



నరేశ్

కథలాపూర్/పెగడపల్లి: మండలంలోని పోసానిపేటకు చెందిన కుందారపు విజయ్ డీఎస్సీలో ప్రతిభ చాటాడు. స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)లో ఐదో ర్యాంకు సాధించాడు. ఎంఎస్సీ మ్యాథ్స్, బీఈడీ పూర్తి చేసిన విజయ్ 2023-24లో గురుకులం టీచర్ పరీక్షకు హాజరయ్యాడు. టీజీటీ, పీజీటీ, జేఎల్ మ్యాథ్స్ పోస్టుకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది జులైలో జిల్లాకేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో జేఎల్‌గా విధుల్లో చేరాడు. అలాగే పెగడపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన తడగొండ నరేశ్ సోమవారం వెలువడిన డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో 18వ ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులు రాజయ్య, రాజమల్లవ్వ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ నరేశ్‌ను చదివించారు. డిగ్రీ, బీఎడ్, ఎంబీఏ, పీజీ పూర్తిచేసిన నరేశ్ డీఎస్సీలో ప్రతిభ చూపడంపై గ్రామస్తులు అభినందించారు.

ఉయ్యాల పాటలు.. ఆడబిడ్డల ఆటలు

- నేటినుంచి బతుకమ్మ వేడుకలు
- ఎంగిలిపూలతో ప్రారంభం
- 10న సద్దులతో ముగింపు
- సిద్ధమవుతున్న అతివలు
- మార్కెట్లో సందడి

ఇద్దరక్క చెల్లెండ్లు ఉయ్యాలో..
ఒక్కూరికిచ్చిరి ఉయ్యాలో..
ఒక్కడే మాయన్న ఉయ్యాలో..
వచ్చెన్నపోడు ఉయ్యాలో..

అంటూ నేటినుంచి ఆడబిడ్డలు ఆడి పాడనున్నారు. తెలంగాణ ఆడపడుచులకు ఇష్టమైన బతుకమ్మ వేడుక నేటి ఎంగిలిపూలతో ప్రారంభం కానుంది. పుడమికి పూల పందిరేసినట్లు.. పున్నమి వెన్నెల నేలపై వాలినట్లు.. రంగురంగుల పూలతో రంగవల్లులు అల్లుకున్నట్లు.. సిబ్బిలో, పళ్లెంలో, తాంబాలాల్లో బతుకమ్మను పేర్చి.. ఆడబిడ్డలందరూ ఒక్కచోట చేరి.. వీధుల్లో బతుకమ్మను ఉంచి.. ఆడిపాడే పండుగ రానే వచ్చింది. నేటి ఎంగిలిపూలతో ప్రారంభమై.. అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానెబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నెముద్దల బతుకమ్మ, తొమ్మిదోరోజు సద్దుల(పెద్ద) బతుకమ్మతో పండుగ ముగుస్తుంది. ఈ క్రమంలో బతుకమ్మ వేడుకలు ఉమ్మడి జిల్లా ఆడపడుచులు రెడీ అవుతున్నారు. మార్కెట్లో పూలు, సామగ్రితో సందడి నెలకొంది.

– కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్(కరీంనగర్)



బతుకమ్మ అనే పదానికి తెలంగాణలో విభిన్న పర్యాయ పదాలు వాడుకలో ఉన్నాయి. బతుకమ్మ అంటే పూలతో కూడిన అమరిక అని అర్థం. ఈ కాలంలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను కొన్ని వరసలు పేరుస్తారు. మధ్యలో గౌరమ్మను పెట్టి అమ్మవారిగా కొలుస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను జరుపుకుంటారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం చేస్తారు. రెండోరోజు అటుకల బతుకమ్మగా కొలుస్తారు. బెల్లం, అటుకులు, పప్పుతో చేసిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మగా జరపుకుంటారు. బెల్లం, ముద్దపప్పు, పాలతో తయారు చేసిన నైవేద్యాన్ని తయారు చేస్తారు. నాలుగోరోజు నానె బియ్యం బతుకమ్మను జరుపుకుంటారు. నానపెట్టిన బియ్యం, పాలు, బెల్లంతో కలిపి ముద్దలుగా తయారుచేసి నైవేద్యంగా సమర్పిస్తారు.ఐదోరోజు అట్ల బతుకమ్మను జరుపుకుంటారు. బియ్యం పిండితో అట్లను నైవేద్యంగా తయారు చేస్తారు. ఆరోరోజు అలిగిన బతుకమ్మ. ఈరోజు బతుకమ్మను పూలతో అలకరించరు. ఏడోరోజు వేపకాయల బతుకమ్మ. తంగేడు, చామంతి, గులాబీ, గునక పూలతో ఏడంతరాలు బతుకమ్మను పేరుస్తారు. బియ్యం పిండిని వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా పెడతారు. ఎనిమిదో రోజు వెన్నెముద్దల బతుకమ్మ. అమ్మవారికి ఇష్టమైన నువ్వులు, వెన్న, బెల్లంతో తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. బతుకమ్మ నవరాత్రి ఉత్సవాల్లో సద్దుల బతుకమ్మ చివరిది. ఈ రోజు అన్నిరకాల పూలతో భారీ బతుకమ్మలను పేరుస్తారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పెట్టి ఆటపాటలతో గౌరమ్మను కొలుస్తారు. పెరుగన్నం, నువ్వుల అన్నం వంటి ఐదు రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పిస్తారు.

ఉమ్మడి జిల్లాలో విభిన్నంగా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బతుకమ్మను కొన్ని ప్రాంతాల్లో విభిన్న తీరిలో కొలుస్తారు. జగిత్యాల జిల్లాలోని కొన్నిచోట్ల బతుకమ్మ ఆడే చోట బావిలాంటి గుంత తవ్వి.. చుట్టూ బతుకమ్మలు పెట్టి ఆడతారు. వేములవాడలో ఏడు రోజులకు సద్దుల పండుగ జరుపుకుంటారు. కరీంనగర్ జిల్లాలోని బొమ్మకల్, రాఘవాపూర్, శ్రీనివాస్‌నగర్, ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ నిర్వహిస్తారు. కొన్ని ప్రాంతాల్లో మగవారు బతుకమ్మ ఆడతారు. జగిత్యాల జిల్లా, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో దసరా పండుగ తరువాత సద్దుల బతుకమ్మ జరుపుకుంటారు.

తొమ్మిది రోజుల సంబరం



ఏడాది మొత్తం ఎదురుచూస్తూ మహిళలందరూ తొమ్మిది రోజులు సంతోషంగా జరుపుకునే వేడుక బతుకమ్మ. మెట్టినిల్లు ఎక్కడ ఉన్నా.. పుట్టింటి కి చేరి స్నేహితులతో, వాడకట్టువాళ్లతో కలిసి జరుపుకునే పండుగ. మన పల్లెసంస్కృతికి అద్దంపట్టే ఈ పండుగ వెళ్లినప్పటి నుంచి మళ్లీ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేలా చేస్తుంది.

– మెతుకు హేమలత, హరిహరనగర్, కరీంనగర్

అమ్మను ఆరాధించడమే



భూమిపై ఉన్న సకల జీవాలను కాపాడేదే శక్తి. అందుకే ఆటపాటలతో అమ్మను ఆరాధించడమే బతుకమ్మ. ఆట పాటలు, నవ్వులు, కేరింతలే వ్యాయామం అంటున్నారు వైద్యులు. ఏడాదికి ఒక్కసారి వచ్చే ఈ పండుగలో ఇవి అన్ని ఉన్నాయి.

– మడుపు విజయలక్ష్మి, భగత్‌నగర్, కరీంనగర్

మన సంస్కృతికి నిదర్శనం



మన సంస్కృతికి నిదర్శనం బతుకమ్మ. ప్రతీ పువ్వుకు పవిత్రత చేకూర్చి ఆరాధనీయం చేసిన పల్లెవాసుల మంచి మనస్సుల ప్రతీకగా బతుకమ్మ నిలుస్తుంది. తొమ్మిదిరోజుల పాటు పాట, ఆట కలగల్సిన బతుకమ్మ సంబరాలతో పల్లె, పట్టణం మునిగి తేలుతుంది.

– తొడుపునూరి సౌమ్య, జ్యోతినగర్, కరీంనగర్

నుదుటి సింధూరం



మహిళల ఆరాధ్య దేవతగా భాసిల్లుతున్న తీరొక్క పూల పండుగ బతుకమ్మ. పూలతో పూజలు చేసే సనాతన సంప్రదాయానికి భిన్నంగా పూలకు పూజలు చేసే విశిష్ట వేడుక. రంగురంగుల పూలను అందమైన ఆకృతితో కూర్చి, లయ, విన్యాసాలను ఆటలో చేర్చి, ఆధ్యాత్మికతను చాటే బతుకమ్మ తెలంగాణ నుదుటి సింధూరం.

– బాశెట్టి రత్నమాల, తీగలగుట్ట పల్లి, కరీంనగర్

అనుబంధాలకు ప్రతీక



అన్నకు చెల్లెళ్లకు ఉన్న అనుబంధంతో పాటు ప్రకృతికి మహిళలకు ఉన్న బంధానికి ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ తీరు అన్ని పండుగలకు భిన్నంగా ఉంటుంది. మహిళలందరూ సంప్రదాయ దుస్తులు ధరించి ఒక్కచోట చేరి సంబురాలు జరుపుకోవడం, నైవేద్యాలు ఇచ్చి పుచ్చుకోవడం అందరిలో ప్రేమాభిమానాలు పెంపొందిస్తుంది.

– ఇనుకొండ అనిత, భగత్‌నగర్, కరీంనగర్

పీసీసీ చీఫ్‌ని కలిసిన 'అల్ఫోర్స్' చైర్మన్



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మొక్క అందిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి మంగళవారం పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి, మొక్క అందజేశారు. అయితే, నరేందర్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయనున్న నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు కోరేందుకే కలిసినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. తాను గతంలోనే కాంగ్రెస్‌లో చేరానని, ఇప్పటికీ పార్టీలోనే కొనసాగుతున్నానని నరేందర్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడికి చెప్పినట్లు సమాచారం. అలాగే, కరీంనగర్, ఆదిలా బాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి నాలుగు జిల్లాల్లో ఓటరు నమోదు నిర్వహించామని, ప్రచారం కూడా విస్తృతంగా చేపడుతున్న ట్లు చెప్పినట్లు తెలిసింది. కార్యక్రమంలో సీహెచ్. మధుసూదన్‌రెడ్డి, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా డీడీవోపీగా బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న శరత్

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్(డీడీవోపీ)గా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధరావత్ శరత్ మంగళవారం కరీంనగర్ జిల్లా కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదివరకు హుజూరాబాద్ సబ్ కోర్టు అడిషనల్ పీపీగా పని చేశారు. పదోన్నతిపై కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. శరత్ ఉమ్మడి జిల్లాలోని ప్రాసిక్యూటర్ల పరిపాలన బాధ్యతలు చూస్తారు. మహబూబ్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏపీపీగా ఉన్న రామ్ పదోన్నతిపై కరీంనగర్ జిల్లా కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బదిలీ కాగా, మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. హుజూరాబాద్ సబ్ కోర్టు ఇన్‌చార్జి అడిషనల్ పీపీగా గౌరు రాజిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

మహిళాకానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

- ముందుకొచ్చిన మహిళా కానిస్టేబుళ్లు
- మల్యాల, కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ల సిబ్బంది విరాళం
- ఆమె కుమారుడి పేరిట రూ.2.34 లక్షల పోస్టల్ బాండ్



వేదశ్రీ తల్లిదండ్రులకు పోస్టల్ బాండ్ అందిస్తున్న మల్యాల పోలీసులు

మల్యాల(చొప్పదండి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహిళా కానిస్టేబుల్ వేదశ్రీ కుటుంబానికి పోలీసులు అండగా నిలిచారు. జిల్లాతోపాటు మల్యాల, కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ల మహిళా కానిస్టేబుళ్లు, సిబ్బంది రూ.2.34 లక్షల విరాళాలు సేకరించారు. మల్యాల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ వేదశ్రీ విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో పోలీస్ సిబ్బంది రూ.2.34 లక్షలు సేకరించి వేదశ్రీ కుమారుడు అకుల్ విద్యారామన్ పేరిట పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. వేదశ్రీ తల్లిదండ్రులు సుశీల, మురళికి మంగళవారం పోస్టల్ బాండ్ అందించారు. ఎస్సై నరేశ్‌కుమార్, ఏఎస్సై రుద్ర కృష్ణకుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు మల్లారెడ్డి, అహ్మద్ పాషా, భాస్కర్, రైటర్ నరేశ్, మహిళా కానిస్టేబుళ్లు జ్యోతి, లత, వనిత, సంఘవి పాల్గొన్నారు.

ఇరాక్‌లో జగిత్యాల వాసుల కష్టాలు

- తిండిలేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- ఎంబసీకి ఫిర్యాదు చేశారని యజమాని దాడి



స్వదేశానికి పంపాలని వేడుకుంటున్న యువకులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కోరన్నపల్లె గ్రామానికి చెందిన పంగ సత్తయ్య, బుగ్గారం మండలం సిరికొండకు చెందిన బట్టు హరీశ్, నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం తాల్వేడ గ్రామానికి చెందిన ఒరికె నడిపి రాజన్న ఇరాఖ్‌లో ఐదు నెలలుగా వేతనాలు అందక తిండి లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారు ఇరాఖ్‌లోని భారత రాయబార కార్యాలయానికి సమాచారం అందించారు. ఎంబసీకి ఎందుకు ఫిర్యాదు చేశారని యజమాని వీరిపై దాడిచేయడంతోపాటు, తిండి పెట్టకుండా నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం కరీంనగర్‌కు చెందిన ఓ ఏజెంట్‌కు ఒక్కొక్కరు రూ.2.50 లక్షల చొప్పున చెల్లించి ఇరాఖ్‌లోని సమ్మర్ ఆల్ షకీర్ కంపెనీకి వెళ్లారు. నెలకు కేవలం 400డాలర్ల వేతనం మాత్రమే ఇస్తున్నారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ముగ్గురు కార్మికులు పని మానేశారు. ఈ క్రమంలో వారికి వారికి భోజనం పెట్టవద్దని కంపెనీ యజమాని మెస్ వారికి హుకూం జారీ చేశారు. పనిలేక.. భోజనం అందక రూంలలో ఉంటున్నారు. 25 రోజుల క్రితం యజమాని వచ్చి ముగ్గురిపై దాడిచేసి బలవంతంగా పనికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని బాధితులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు సీఎం ప్రజావాణిలో ఈనెల 11న ఫిర్యాదు చేశారు. స్పందించిన ప్రభుత్వం వెంటనే ఇరాఖ్‌లోని భారత రాయభార కార్యాలయానికి సమాచారం చేరవేసింది. భారత రాయభార కార్యాలయం అక్కడి యజమానిని పిలిపించడంతో తనపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ కార్మికులను మరోసారి చితకబాదడంతోపాటు, చిత్రహింసలకు గురి చేస్తుండటంతో కార్మికులు తమను స్వదేశానికి తీసుకొచ్చేలా భారత ప్రభుత్వం కృషి చేయాలని వేడుకుంటున్నారు.

బస్సు ఎక్కుతుండగా పర్సు చోరీ

- పర్సులో రూ.లక్ష, తులం బంగారం
- సీసీ పుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికురాలి బ్యాగ్‌లోంచి గుర్తుతెలియని మహిళ పర్సు దొంగిలించింది. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన విజయలక్ష్మీ తన కుటుంబసభ్యులతో జగిత్యాలకు వచ్చింది. బ్యాంకులో రూ.లక్ష డ్రా చేసుకుని తన సోదరుడి వద్దనున్న తులం బంగారం తీసుకుని సారంగాపూర్‌కు వెళ్లేందుకు పాత బస్టాండ్‌కు వచ్చింది. కడెం వెళ్లే బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని మహిళ ఆమె పర్సు కొట్టేసింది. విజయలక్ష్మీ కొద్దిదూరం వెళ్లాక కుమారుడికి బస్ టికెట్ తీసేందుకు పర్సు కోసం చూడగా కనిపించ లేదు. పర్సులో రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం కూడా ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు పాతబస్టాండ్ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

అంతర్గాంలో యువకుడి హత్య

- కనిపించకుండాపోయిన కుటుంబ సభ్యులు
- సోదరుడే హత్య చేసినట్లు అనుమానిస్తున్న పోలీసులు?



విద్యాసాగర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన నల్లపునేని విద్యాసాగర్ (33) మంగళవారం సాయంత్రం హత్యకు గురయ్యాడు. సాయంత్రం ఇంటి సమీపంలో శవమై ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించాడు. అతడిని ఎవరో హత్య చేసినట్లు గుర్తించారు. హతుడి తల్లిదండ్రి, సోదరుడు, మరదలు కనిపించకుండా పోవడం... విద్యాసాగర్‌కు ఆయన సోదరుడు విక్రమ్‌రాజు మధ్య కొద్దికాలంగా కుటుంబకలహాలు ఉన్నాయని తేలడం.. కొద్దికాలంగా తల్లితండ్రులతోపాటు సోదరుడిని నిత్యం వేధిస్తుడడంతో విక్రమ్‌రాజే హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విద్యాసాగర్ మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్య చేశారని అనుమానిస్తున్న విక్రమ్‌రాజు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

డిజిటల్ సర్వేకు ఏఈవోలు విముఖత

- క్షేత్రస్థాయి ఇబ్బందులపై డీఏఓకు వినతి
- జిల్లాలో ప్రారంభం కాని క్రాప్ సర్వే
- జిల్లాలో ఏఈవోలు 71 మంది
- సాగు భూమి 3,98,387 ఎకరాలు



డీఏవోకు వినతిపత్రం అందిస్తున్న ఏఈఓలు

జగిత్యాలరూరల్: గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేకు అడ్డంకులు మొదలయ్యాయి. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. డిజిటల్ సర్వేలో ఇబ్బందులు ఉన్నాయని వివరిస్తూ ఏఈఓలు జిల్లా వ్యవసాయాధికారి వాణికి వినతిపత్రం అందించారు. డిజిటల్ సర్వే కోసం ఏఈఓలకు శిక్షణ అందించి.. యాప్‌పై అవగాహన కల్పించిన విషయం తెల్సిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేపట్టాల్సి ఉన్నా.. నేటికీ ఆరంభం కాలేదు.

రైతు ప్రయోజనాలకే..

ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ.. వ్యవసాయ సామర్థ్యాన్ని పెంపొందించి రైతుకు ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం డిజిటల్ సర్వే చేపట్టింది. ఈ సర్వే ద్వారా రైతు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నంబర్ ఆధారంగా పక్కాగా నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వేనంబర్‌కు దూరంగా ఉంటే యాప్‌లో నమోదుకావని అధికారులు చెబుతున్నారు. సర్వే ఆధారంగా పంటల కొనుగోలు, ఎగుమతులు, మార్కెటింగ్‌తోపాటు ప్రకృతి వైపరీత్యాలతో జరిగే నష్టాన్ని అంచనా వేయటం.. తదితర వివరాలు సేకరించడంలో డిజిటల్ క్రాప్ సర్వే సహాయపడనుంది.

డిజిటల్ సర్వేతో ఇబ్బందులు

ప్రభుత్వం నూతనంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేకు అనేక ఇబ్బందులు ఉన్నాయని ఏఈఓలు అంటున్నారు. ఐదువేల ఎకరాలకు ఒక ఏఈఓ ఉండాల్సి ఉన్నా.. ప్రస్తుతం 8వేల నుంచి 10వేల ఎకరాల వరకు బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. సర్వే నంబర్‌లో గల సబ్ డివిజన్లను తప్పనిసరిగా వెళ్లి పంట వివరాలు సేకరించాల్సి ఉంటుంది. వర్షాకాలంలో పొలాలకు వెళ్లి వివరాలు సేకరించడం కష్టమంటున్నారు. మహిళా ఉద్యోగులు పొలాలకు వెళ్లి సర్వే చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో సర్వే ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. సర్వే కోసం నూతనంగా ట్యాబ్‌లను అందించి.. అదనపు భత్యం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికే పనిభారం

వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఏఈవోలకు ఇప్పటికే పనిభారం ఉందని, రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్, క్రాప్ బుకింగ్, ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాల పరిశీలన వంటి పనులతో ఏఈవోలు తీవ్ర పనిభారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ బుకింగ్‌ను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా చేయించాలని ఏఈవోలు కోరుతున్నారు.

ప్రైవేటు ఏజెన్సీలతో చేపట్టాలి



పంటల సాగు వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే కోసం ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలను నియమించాలి. అలాగే అదనపు బాధ్యతలు అప్పగించినప్పుడు అదనపు భత్యం ఇవ్వాలి. ట్రావెలింగ్ భత్యం చెల్లించాలి. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించాలి.

– సందీప్, ఏఈవో, బీర్‌పూర్

నామని సుజాతాదేవికి ఎక్స్‌రే కవితా పురస్కారం

విజయవాడ కల్చరల్: ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ జాతీయస్థాయిలో నిర్వహించిన వచన కవితల పోటీల్లో కరీంనగర్‌కు చెందిన నామని సుజాతాదేవి రచించిన 'ఆమె' కవితకు అత్యుత్తమ కవితా పురస్కారం దక్కిందని సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ రచయిత ముంగారి రాజేంద్ర కవితల పోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి పొందిన విజేతను రూ.10 వేల నగదు బహుమతితో సత్కరిస్తామని పేర్కొన్నారు. కె.అప్పలరాజు (అనకాపల్లి), చొక్కర తాతారావు (విశాఖపట్నం), ఎస్.లహరి (హైదరాబాద్), డాక్టర్ రాధాశ్రీ (హైదరాబాద్), రేపాక రఘునందన్ (తిరువూరు), సునాతుని వెంకు (బాపట్ల), పొత్తూరి సీతారామారావు (కాకినాడ), కమలేష్ (రంగారెడ్డి), నెలుట్ల రమాదేవి (స్టేషన్‌ఘన్‌పూర్), జగన్నాథ రామమోహన్ (నెల్లూరు)ను ఉత్తమ కవులుగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారని తెలిపారు.

లెక్చరర్.. విద్యార్థి మధ్య గొడవ

కోరుట్ల: పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో లెక్చరర్.. విద్యార్థి మంగళవారం ఘర్షణకు దిగడం కలకలం రేపింది. విద్యార్థి తల్లిదండ్రులు కళాశాల వద్ద గొడవ చేయడంతో కోరుట్ల సీఐ సురేశ్‌బాబు జోక్యం చేసుకొని గొడవను సద్దుమణిగేలా చేశారు. లెక్చరర్, విద్యార్థి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



కిక్కిరిసిన ప్రయాణికులు

కిక్కిరిసిన జగిత్యాల బస్టాండ్

జగిత్యాలటౌన్:దసరా సందడి ప్రారంభం కావడంతో ఆర్టీసీ బస్టాండ్‌లు కిక్కిరిసిపోతున్నాయి. మంగళవారం జగిత్యాల బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూశారు. 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 150 మంది వరకు ప్రయాణించాల్సి వచ్చింది. పండగ రద్దీ సందర్భంగా వివిధ రూట్లలో అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.